నమస్తే తెలంగాణ

# మహబూబాబాద్

5 | ఆదివారం 21 జనవరి 2024 | MAHABUBABAD


## మెగా జాబ్ మేళాలో 562మందికి ఉద్యోగాలు

ములుగు రూరల్, జనవరి 20 : ఏటూరునాగారం ఐటీడీఏ ఆధ్వర్యంలో శనివారం జాకారం వైటీసీలో నిర్వహించిన మెగా జాబ్‌మేళాలో 562మంది అభ్యర్థులు ఉద్యోగాలకు ఎంపికయ్యారు. ఉమ్మడి వరంగల్ జిల్లా నుంచి 676మంది గిరిజన నిరుద్యోగ యువతీ, యువకులు జాబ్‌మేళాకు హాజరు కాగా 562 మందికి ప్రైవేట్ కంపెనీల్లో వివిధ స్థాయిల్లో ఉద్యోగాలు లభించాయని ఏపీఓ వసంతరావు తెలిపారు. ఎంపికైన అభ్యర్థులకు అర్హత ఆధారంగా రూ.15వేల నుంచి రూ.35వేల చొప్పున వేతనాలు నిర్ణయించినట్లు చెప్పారు. కార్యక్రమంలో ఏపీడీ బాలస్వామి, డీపీఎం సతీశ్, జేడీఎం కొండల్‌రావు పాల్గొన్నారు.



యువతికి ఉద్యోగ నియామక పత్రం అందిస్తున్న ఏపీఓ వసంతరావు



సమీక్షలో పాలకుర్తి కాంగ్రెస్ నాయకురాలు హనుమాండ్ల ఝాన్సీరెడ్డి (వృత్తంలో)

## ఝాన్సీ, కొమ్మూరి దర్జా

- అధికారిక సమావేశంలో కాంగ్రెస్ నేతలు
- మంత్రుల సాక్షిగా ఉల్లంఘనలు
- ఎమ్మెల్యేల తరహా పాల్గొనడంపై విమర్శలు

వరంగల్, జనవరి 20(నమస్తే తెలంగాణ ప్రతినిధి) : కాంగ్రెస్ ప్రభుత్వంలో ఆ పార్టీ నాయకులు.. ఎమ్మెల్యేలతో సమానంగా వ్యవహరిస్తున్నారు. ప్రభుత్వ అభివృద్ధి, సంక్షేమ పథకాల అమలుపై నిర్వహించే సమీక్షల్లో ఎమ్మెల్యేలతో పాటు వారు కూడా దర్జాగా పాల్గొంటున్నారు. వివిధ అంశాలపై ప్రజాప్రతినిధుల వలె ఆదేశాలు ఇస్తున్నారు. వరంగల్ ఉమ్మడి జిల్లా ఇన్‌చార్జి మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి ఆధ్వర్యంలో శనివారం హనుమకొండ కలెక్టరేట్‌లో సమీక్ష జరుగగా మంత్రులు కొండా సురేఖ, సీతక్క, పొన్నం ప్రభాకర్ సహా ఉమ్మడి జిల్లాలోని ఎమ్మెల్యేలు హాజరయ్యారు. ప్రభుత్వపరంగా నలుగురు మంత్రులు నిర్వహించిన సమీక్షలో ఎమ్మెల్యేలకు మాత్రమే అని చెప్పారు. కానీ ఈ సమావేశంలో కాంగ్రెస్ నేతలు కొమ్మూరి ప్రతాప్‌రెడ్డి, హనుమాండ్ల ఝాన్సీరెడ్డి ఎమ్మెల్యేలతో సమానంగా పాల్గొన్నారు. అసెంబ్లీ ఎన్నికల్లో జనగామ నియోజకవర్గం నుంచి కాంగ్రెస్ తరపున పోటీ చేసి ఓడిపోయిన కొమ్మూరి ప్రతాప్‌రెడ్డి, పాలకుర్తికి చెందిన కాంగ్రెస్ నాయకురాలు హనుమాండ్ల ఝాన్సీరెడ్డి సమీక్షలో పాల్గొని అధికారులకు పలు అంశాలపై ఆదేశాలు ఇచ్చారు. కొమ్మూరి కొద్దిసేపు ఉండి వెళ్లిపోయారు. ఝాన్సీరెడ్డి సమీక్ష మొదలైనప్పటి నుంచి ముగిసే వరకు సమావేశంలోనే ఉన్నారు. నలుగురు మంత్రుల సమక్షంలో జరిగిన ప్రభుత్వ కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు ఇలా ఎమ్మెల్యేల తరహాలో వ్యవహరించడంపై విమర్శలు వెల్లువెత్తుతున్నా యి. జిల్లా యంత్రాంగం అయినా ఇలాంటి విషయాలపై అప్రమత్తంగా ఉండాలనే అభిప్రాయం వ్యక్తమవుతున్నది. ఉమ్మడి జిల్లా అభివృద్ధిపై నిర్వహించిన సమీక్ష సమావేశానికి ఎమ్మెల్యేలను తప్ప ఎవరినీ ఆహ్వానించలేదు. ఎంపీలు, ఎమ్మెల్సీలు, మేయర్, జిల్లా పరిషత్ చైర్‌పర్సన్లు, మున్సిపల్ చైర్‌పర్సన్లను ఆహ్వానించకపోవడంపైనా అధికారుల్లోనూ చర్చ జరిగింది. ప్రభుత్వపరంగా జరిగిన సమీక్ష సమావేశానికి ప్రజాప్రతినిధులను పాల్గొనకుండా చేయడం సరికాదని సర్వత్రా అభిప్రాయం వ్యక్తమైంది.

### పోలీసు పహారా..

సమీక్ష సమావేశం సందర్భంగా హనుమకొండ కలెక్టరేట్ మొత్తం పోలీసులతో నిండిపోయింది. ఆరు జిల్లాలకు చెందిన వందలాది మంది పోలీసులు హనుమకొండ కలెక్టరేట్‌లోనే ఉ న్నారు. గతంలో ముఖ్యమంత్రులు వచ్చినప్పుడు కూడా లేనంత మంది పోలీసులు మంత్రుల పర్యటనలో ఉండడంపై వరంగల్ నగర ప్రజలు చర్చించుకున్నారు. హైదరాబాద్ మార్గంలో వరంగల్ నగర శివారు నుంచి హనుమకొండ కలెక్టరేట్ వరకు అడుగడుగునా పోలీసులు కనిపించారు.





సమీక్షకు హాజరైన ఉమ్మడి జిల్లా ఎమ్మెల్యేలు, కలెక్టర్లు, సీపీ, ఎస్పీలు

సమీక్షలో మాట్లాడుతున్న ఇన్‌చార్జి మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి, చిత్రంలో మంత్రులు కొండా సురేఖ, సీతక్క, పొన్నం ప్రభాకర్

# ప్రజాభీష్టం మేరకే పాలన

## ఆరు గ్యారెంటీలు పక్కాగా అమలు చేస్తాం

*కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన ఆరు గ్యారెంటీలను పక్కాగా అమలు చేస్తామని, ప్రజాభీష్టం మేరకే పాలన ఉంటుందని రాష్ట్ర రెవెన్యూ, హౌసింగ్, సమాచార పౌర సంబంధాల శాఖల మంత్రి, ఉమ్మడి వరంగల్ జిల్లా ఇన్‌చార్జి మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి అన్నారు. ఉమ్మడి వరంగల్ జిల్లా అభివృద్ధిపై హనుమకొండ కలెక్టరేట్‌లో మంత్రులు కొండా సురేఖ, సీతక్క, పొన్నం ప్రభాకర్‌తో కలిసి శనివారం సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భ ంగా పొంగులేటి మాట్లాడుతూ ప్రభుత్వ భూముల ఆక్రమణపై చర్యలు తీసుకుంటామని స్పష్టం చేశారు.*

*- హనుమకొండ, జనవరి 20*

- ప్రభుత్వ భూముల ఆక్రమణపై దృష్టి
- గంజాయిపై ఉక్కుపాదం మోపుతాం
- పంటలకు సాగునీరు అందించాలి
- మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి
- ప్రజలకు సేవ చేయడమే లక్ష్యం : మంత్రి సురేఖ
- మేడారం జాతరను విజయవంతం చేయాలి : మంత్రి సీతక్క
- అభివృద్ధికి ప్రణాళికలు సిద్ధం చేయాలి : మంత్రి పొన్నం
- ఉమ్మడి జిల్లా అభివృద్ధిపై హనుమకొండ కలెక్టరేట్‌లో సమీక్ష

### కళాక్షేత్రం పనులు పూర్తిచేయాలి

కాళోజీ కళాక్షేత్రం పనులను వెంటనే పూర్తి చేయాలని మంత్రి పొంగులేటి ఆదేశించారు. హనుమకొండ బాలసముద్రంలో నిర్మిస్తున్న కళాక్షేత్రాన్ని మంత్రి కొండా సురేఖ, ఎమ్మెల్యేలతో కలిసి శనివారం సాయంత్రం పరిశీలించారు. ఆర్ట్ గ్యాలరీ, ఆడిటోరియంను పరిశీలించి సూచనలు చేశారు. పనుల గురించి కుడా, ఇతర అధికారులు వివరించారు. కళాక్షేత్రం మ్యాప్‌ను మంత్రులు పరిశీలించారు.

**త్వరలోనే ఫ్లాట్ల వేలం**

కరీమాబాద్ : వరంగల్‌లోని రాంకీ బిల్డర్స్ హౌసింగ్ బోర్డుకు కేటాయించిన సింగిల్ బెడ్‌రూమ్ గల 102 ఫ్లాట్లను త్వరలో ఓపెన్ వేలం వేస్తామని మంత్రి పొంగులేటి తెలిపారు. మంత్రి సురేఖతో కలిసి శనివారం రాత్రి ఆయన ఫ్లాట్లను పరిశీలించారు. వేలంలో ఇబ్బందులు కలుగకుండా చర్యలు చేపట్టాలన్నారు.

### సమస్యలు పరిష్కరిస్తాం : మంత్రి సీతక్క

బడ్జెట్‌లో నిధుల కేటాయింపు కోసమే ఉమ్మడి జిల్లా సమీక్షా సమావేశం నిర్వహించినట్లు రాష్ట్ర పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి, ఆర్‌డబ్ల్యూఎస్, స్త్రీ శిశు సంక్షేమ శాఖల మంత్రి ధనసరి (అనసూయ) సీతక్క అన్నారు. నియోజకవర్గాల వారీగా సమస్యలు తెలుసుకున్నామని, త్వరలోనే పరిష్కరిస్తామని తెలిపారు. అధికారులు సమన్వయంతో పనిచేయాలని ఆదేశించారు. మేడారం జాతరకు మరిన్ని బస్సులు కేటాయించాలని మంత్రి పొన్నంను కోరారు. జాతరకు ఏర్పాట్ల పరిశీలనకు రావాలని సహచర మంత్రులను ఆహ్వానించారు. రామప్ప లక్నవరం సరస్సుల అనుసంధానానికి కాలువల నిర్మాణం కోసం భూసేకరణ జరిగిందని, పెండింగ్‌లో ఉన్న ల్యాండ్ అక్విడేషన్ కోసం డబ్బులు అందించాలన్నారు. రాష్ట్ర రవాణా, బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ మాట్లాడుతూ ఉమ్మడి కరీంనగర్ పరిధిలో ఉన్న మూడు మండలాలు హనుమకొండ జిల్లా పరిధిలోకి వచ్చాయని, వాటి అభివృద్ధికి అధికారులు ప్రణాళికలు సిద్ధం చేయాలని ఆదేశించారు.

నీటిపారుదల, పంచాయతీరాజ్, ఆర్‌అండ్‌బీ, కుడా, జీడబ్ల్యూఎంసీ, నేషనల్ హైవేస్, ఐటీడీఏ, హౌసింగ్, పోలీస్, ఫారెస్ట్, దేవాదాయ శాఖల పనితీరు, చేపట్టిన, చేపట్టబోయే అభివృద్ధి కార్యక్రమాలపై ఆయా శాఖల అధికారులతో మంత్రులు సమీక్ష నిర్వహించారు. అనంతరం మంత్రి శ్రీనివాస్‌రెడ్డి విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ ఉమ్మడి వరంగల్ జిల్లా సమగ్రాభివృద్ధికి కృషి చేస్తామన్నారు. వచ్చే ఎండాకాలంలో ఎక్కడా తాగునీటి ఇబ్బందులు రాకుండా అధికారులు చర్యలు చేపట్టాలన్నారు. డబుల్ బెడ్‌రూమ్ ఇండ్లు ఏ స్థాయిలో ఉన్నా పూర్తిచేసి లబ్ధిదారులకు ఇస్తామని చెప్పారు. మేడారం జాతరకు రాష్ట్ర ప్రభుత్వం రూ.105 కోట్లు కేటాయించిందని, ఇప్పటికే రూ.75 కోట్లు విడుదల చేశామని, త్వరలో మరో రూ.30కోట్లు విడుదల చేస్తామని పేర్కొన్నారు. మేడారంలో అభివృద్ధి పనులు నెలాఖరులోగా పూర్తవుతాయన్నారు. జాతరను విజయవంతం చేసేందుకు అధికారులు సమన్వయంతో పనిచేయాలన్నారు. ఆరు గ్యారెంటీలు, రేషన్ కార్డులకు సంబంధించిన దరఖాస్తుల్లో 95 శాతం ఆన్‌లైన్‌లో అప్‌లోడ్ చేశామని, గత ప్రభుత్వం ప్రారంభించిన ప్రాజెక్టులపై చర్చించి చర్యలు తీసుకుంటామని చెప్పారు. పంటల సాగుకు నీరందకపోతే ఇబ్బందులు వస్తాయని, కాబట్టి ఆ శాఖ అధికారులు సాగునీరందించేందుకు చర్యలు చేపట్టాలన్నారు. హాస్పిటళ్లు, పాఠశాలలు, హాస్టళ్లను కలెక్టర్లు, అధికారులు ఎప్పటికప్పుడు తనిఖీ చేయాలని, తాను కూడా ఎక్కడోచోట ఆకస్మికంగా తనిఖీ చేస్తానని చెప్పారు. రాష్ట్ర బడ్జెట్‌లో ఉమ్మడి వరంగల్‌కు ప్రాధాన్యత ఇస్తామన్నారు. ప్రభుత్వ భూములను గజం కూడా వదలబోమని, అక్రమించినవారు ఎంతటివారైనా సరే వారి నుంచి వెనక్కి తీసుకుంటామని చెప్పారు.

**అధికారులు సహకరిస్తేనే అభివృద్ధి : మంత్రి సురేఖ**

ప్రజలకు సౌకర్యాలు అందాలంటే ఇలాంటి సమీక్ష సమావేశాలు జరగాలని అటవీ, దేవాదాయ శాఖ మంత్రి కొండా సురేఖ అన్నారు. అధికారులు సహకరిస్తేనే ప్రజలకు అభివృద్ధి, సంక్షేమ ఫలాలు అందుతాయన్నారు. ప్రజా పాలన కార్యక్రమంలో అధికారులు అంకిత భావంతో పనిచేశారని, అదేవిధంగా సహకారం అందించాలన్నారు. నియోజకవర్గాల్లో ఎలాంటి సమస్యలున్నా తమ దృష్టికి తేవాలన్నారు. మామునూరు ఎయిర్‌పోర్ట్ అభివృద్ధి కోసం ఇంకా భూసేకరణ పూర్తి కావాల్సి ఉందన్నారు.

భూముల పరిశీలనకు రావాలని మంత్రి పొంగులేటిని కోరారు. ఫుడ్ ప్రాసెసింగ్ సెంటర్లు ఏర్పాటు చేయాలన్నారు. ఫ్రూట్ మార్కెట్‌తో పాటు వరంగల్లో కూరగాయల మార్కెట్ అంశాన్ని ప్రస్తావించారు. నాలాల ఆక్రమణపై ప్రత్యేక దృష్టి సారించాలన్నారు. హరితహారంలో పండ్ల మొక్కలు పెంచాలని నిర్ణయించినట్లు తెలిపారు. సమావేశంలో ప్రభుత్వ విప్ జాటోట్ రాంచంద్రునాయక్, ఎమ్మెల్యేలు పల్లా రాజేశ్వర్ రెడ్డి, పాడి కౌశిక్‌రెడ్డి, మామిడాల యశస్విని రెడ్డి, డాక్టర్ మురళీ నాయక్, దొంతి మాధవరెడ్డి, రేవూరి ప్రకాశ్‌రెడ్డి, నాయిని రాజేందర్ రెడ్డి, కేఆర్ నాగరాజు, గండ్ర సత్యనారాయణరావు, సీపీ అంబర్ కిశోర్ ఝా, కలెక్టర్లు సిక్తా పట్నాయక్, ప్రావీణ్య, శివలింగయ్య, ఇలా త్రిపాఠి, భవేశ్‌మిశ్రా, అద్వైత్ కుమార్ సింగ్, జీడబ్ల్యూఎంసీ కమిషనర్ రిజ్వాన్ బాషా షేక్, ఐటీడీఏ ప్రాజెక్ట్ ఆఫీసర్ అంకిత్, ఎస్పీలు శబరీష్, డాక్టర్ సంగ్రామ్ సింగ్ జీ పాటిల్, కిరణ్‌ఖరే, అదనపు కలెక్టర్లు రాధికా గుప్తా, మహేందర్ జీ, ట్రైనీ కలెక్టర్ శ్రద్ధా శుక్లా, ట్రైనీ ఐపీఎస్ శుభం నాగరాలెతో పాటు వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న బోయినపల్లి వినోద్‌కుమార్, చిత్రంలో మాజీ మంత్రి ఎర్రబెల్లి

## పదవులను తృణప్రాయంగా వదిలిన చరిత్ర బీఆర్‌ఎస్‌దే..

- కాంగ్రెస్ పార్టీ అబద్ధాలతో గద్దెనెక్కింది
- హామీలను అమలు చేసే వరకూ ప్రజల పక్షాన పోరాడుతాం
- రాష్ట్ర ప్రణాళిక సంఘం మాజీ ఉపాధ్యక్షుడు బోయినపల్లి వినోద్‌కుమార్

రాయపర్తి, జనవరి 20: తెలంగాణ రాష్ట్ర సాధన కోసం పదవులను తృణప్రాయంగా వదిలిన చరిత్ర దేశంలో ఒక్క బీఆర్‌ఎస్‌కే దక్కుతుందని రాష్ట్ర ప్రణాళిక సంఘం మాజీ ఉపాధ్యక్షుడు బోయినపల్లి వినోద్‌కుమార్ అన్నారు. మండలంలోని శివరామపురం(ఆర్‌అండ్‌ఆర్ కాలనీ) బస్టాండ్ కూడలిలో ఏర్పాటు చేసిన తెలంగాణ ఉద్యమకారుడు, బీఆర్‌ఎస్ సీనియర్ నాయకుడు తాళ్లపల్లి నర్సయ్య గౌడ్ విగ్రహాన్ని మాజీ మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు, నర్సయ్యగౌడ్ కుటుంబ సభ్యులతో కలిసి శనివారం ఆయన ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వినోద్‌కుమార్ మాట్లాడుతూ ఇటీవల రాష్ట్రంలో జరిగిన ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ అబద్ధాలు, మాయమాటలతో గద్దెనెక్కిందన్నారు. ప్రజలకు ఇచ్చిన హామీలు అమలు చేసేవరకూ రాష్ట్ర ప్రజల పక్షాన బీఆర్‌ఎస్ పోరాటం చేస్తుందని స్పష్టం చేశారు. రాజకీయాల్లో గెలుపోటములు సహజమన్న ఆయన.. కొట్లాడి సాధించుకున్న తెలంగాణలో గడిచిన పదేళ్లలో సీఎం కేసీఆర్ సారథ్యంలోని రాష్ట్ర ప్రభుత్వం ఎన్నో అద్భుతాలు సృష్టించిందన్నారు. పార్టీ ఆవిర్భావం నుంచి క్రియాశీలకంగా పనిచేసిన నర్సయ్యగౌడ్ ఆశయసాధనకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని పిలుపునిచ్చారు. తెలంగాణ తొలి ముఖ్యమంత్రిగా పనిచేసిన కేసీఆర్.. కృష్ణ, గోదావరి నదులపై ప్రాజెక్టులు నిర్మించి నెర్రెలుబారిన నేలలకు సాగునీరు అందించి సస్యశ్యామలం చేశారని గుర్తుచేశారు. పదేళ్ల కాలంలో 1.61 లక్షల ప్రభుత్వ ఉద్యోగాలను భర్తీ చేయడంతో పాటు రాష్ట్రాభివృద్ధికి అధిక నిధులు తెచ్చారని గుర్తుచేశారు. రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చి 47 రోజులు పూర్తయిందని, ఇచ్చిన హామీల అమలు కోసం మరో 53రోజులు వేచి చూసిన తర్వాత బీఆర్‌ఎస్ ప్రజల పక్షాన పోరాడుతుందని స్పష్టం చేశారు. ఎర్రబెల్లి మాట్లాడుతూ నర్సయ్యగౌడ్ కుటుంబానికి బీఆర్‌ఎస్ అండగా ఉంటున్నదన్నారు. కార్యక్రమంలో సీపీఐ సీనియర్ నాయకులు సుబ్బారావు, మేకల రవి, తమ్మెర విశ్వేశ్వర్‌రావు, ఎంపీపీ జినుగు అనిమిరెడ్డి, జడ్పీటీసీ రంగు కుమార్, కర్ర రవీందర్‌రెడ్డి, బీఆర్‌ఎస్ మండల అధ్యక్షుడు మునావత్ నర్సింహానాయక్, ఆర్‌బీఎస్ మండల కో ఆర్డినేటర్ ఆకుల సురేందర్‌రావు, సర్పంచ్ చెడుపాక కుమారస్వామి, నాగపురి సోమయ్య, గాజు యాకయ్య, గారె నర్సయ్య, ఉస్మాన్, తాళ్లపల్లి సంతోష్‌గౌడ్, కుటుంబ సభ్యులు తాళ్లపల్లి శాంతమ్మ, తండాల శోభారాణి-చంద్రప్రకాశ్, అప విజయ, తేజస్వి, శ్రుతి, రవితేజ పాల్గొన్నారు.



ఆల్ టెర్రన్ వెహికల్

## రెండోరోజు జోరుగా..

- నిట్‌లో ఆకట్టుకున్న ఎగ్జిబిట్లు
- ముఖ్య అతిథిగా హాజరైన రెడ్‌బస్ సీఈవో

నయీంనగర్, జనవరి 20: వరంగల్ నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ (నిట్‌లో)లో రెండో రోజు శనివారం టెక్నోజియాన్-2024 జోరుగా సాగింది. విద్యార్థులు ఎగ్జిబిట్లతో తమ ప్రతిభ చాటారు. ట్రాక్‌పై ఉన్న డేంజర్ బాల్స్‌కు తగలకుండా ఎక్స్‌పై అనే యాప్ ద్వారా సెల్ లేదా రిమోట్‌తో నడిపే 'వైఫై కంట్రోల్ కార్', జాయ్‌స్టిక్ ద్వారా కంట్రోల్ చేస్తూ మోటర్స్ తిరుగుతున్నప్పుడు ఎదురుగా ఉన్న సర్కిల్‌లో బాల్ వేసే 'పింక్‌పాంక్ లాంచర్', సెల్‌ఫోన్‌లో తీసుకున్న ఫొటోను యాప్‌లో డౌన్‌లోడ్ చేసుకున్న తర్వాత జీకోడ్ రూపంలో మార్చి యంత్రమే బొమ్మ గీసే 'పిక్సల్ టూ పొట్రెట్ ప్రింటరింగ్', లైట్ ఎటు కదిపితే అటువైపు సెన్సర్ ద్వారా కారు పోయే 'ఫొటో అండ్ ట్రేస్', సుత్తితో సెన్సర్ మధ్యలో కొడితే ఎంత బలంగా కొట్టామో ల్యాప్‌టాప్‌లో చూపే 'పీజో పవర్ అక్రెట్', గుట్టలు, కొండల్లో నడిపేందుకు వీలుగా డీజిల్‌తో నడిచేలా 25 మంది విద్యార్థులు రూ.10లక్షల ఖర్చుతో ఆరు నెలలు కష్టపడి తయారు చేసిన 'ఆల్ టెర్నన్ వాహనం' ఎగ్జిబిట్లు ఎంతో ఆకట్టుకున్నాయి. కాగా, నిట్‌లోని అంబేద్కర్ లెర్నింగ్ సెంట్రల్‌లో నిర్వహించిన కార్యక్రమానికి రెడ్ బస్ సీఈవో ప్రకాశ్ సంగం ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. రెడ్ బస్ సంస్థను ప్రతి ఒక్కరూ స్ఫూర్తిగా తీసుకోవాలన్నారు. జీవితంలో ఎన్నో ఒడిదొడుకులు వస్తుంటాయని, వాటిని చాలెంజ్‌గా తీసుకుని జీవితంలో ఎదగాలని సూచించారు. రెడ్‌బస్ విశిష్టత గురించి వివరించారు. ఫ్యాకల్టీ అడ్వైజర్ హరిప్రసాద్‌రెడ్డి, స్టూడెంట్ వెల్ఫేర్ డీన్ ప్రొఫెసర్ శ్రీనివాసచారి పాల్గొన్నారు.

### గ్రూప్స్ ఫ్రీ కోచింగ్ దరఖాస్తుకు 24వరకు గడువు

నయీంనగర్, జనవరి 20 : గ్రూప్-1, 2, 3, 4 ఫౌండేషన్ కోర్సు ఉచిత కోచింగ్ కోసం దరఖాస్తుకు ఈ నెల 24 వరకు గడువు పొడిగించినట్లు బీసీ స్టడీ సర్కిల్ డైరెక్టర్ డాక్టర్ ఎంపీవీ ప్రసాద్ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. వరంగల్, హనుమకొండ, జయశంకర్ భూపాలపల్లి, మహబూబాబాద్, జనగామ జిల్లాలకు చెందిన అభ్యర్థులు ఈనెల 24వ తేదీలోగా www.tsbcstudycircle.cgg.gov.in ద్వారా దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. ఎంపికైనవారు ఈనెల 27 నుంచి 30 వరకు సర్టిఫికెట్ల పరిశీలన ఉంటుందని పేర్కొన్నారు. ఇతర వివరాలకు 0870-2571192, 040-24071178, 040-27077929 సంప్రదించాలని కోరారు.

## మొక్కు తీర్చుకునేందుకు తిరుమల కొండకు..

- పాదయాత్రగా బయల్దేరిన గండ్ర జ్యోతి
- ప్రారంభించిన మాజీ ఎమ్మెల్యే వెంకటరమణారెడ్డి



పాదయాత్రగా బయలుదేరి వెళ్తున్న గండ్ర దంపతులు

భూపాలపల్లి రూరల్, జనవరి 20 : భూపాలపల్లి జిల్లాకేంద్రం మంజూర్‌నగర్‌లో శ్రీవేంకటేశ్వరస్వామి ఆలయ నిర్మాణం పూర్తయిన సందర్భంగా మొక్కు తీర్చుకునేందుకు బీఆర్‌ఎస్ జిల్లా అధ్యక్షురాలు, వరంగల్ జడ్పీ చైర్‌పర్సన్ గండ్ర జ్యోతి కాలినడకన తిరుమల కొండకు శనివారం బయల్దేరారు. తొలుత జ్యోతితో కలిసి ఆలయంలో పూజలు నిర్వహించిన తర్వాత మాజీ ఎమ్మెల్యే గండ్ర వెంకటరమణారెడ్డి జెండా ఊపి పాదయాత్రను ప్రారంభించారు. పలువురు ప్రజాప్రతినిధులు, వందల సంఖ్యలో భక్తులు వెంట రాగా కలిసి కాలినడకన తరలివెళ్లారు. జ్యోతితో కలిసి తాను కొద్దిదూరం పాదయాత్రలో పాల్గొంటానని గండ్ర తెలిపారు.


**ఎన్ని ఆటంకాలు వచ్చినా ఎదుర్కొంటా..**

భక్తుల సౌకర్యార్థం, మంచి సంకల్పంతో ఆలయం నిర్మిస్తే కొందరు కుట్ర పూరితంగా కేసులు వేసి ఆటంకాలు సృష్టిస్తున్నారని, ఇది మంచి పద్ధతి కాదని గుడిని రాజకీయాలకు, వ్యక్తిగత కక్షలకు వాడుకోద్దని మాజీ ఎమ్మెల్యే గండ్ర సూచించారు. ఆనాడు భద్రాచలంలో రాముడికి ఆలయాన్ని నిర్మిస్తే భక్త రామదాసుకు ఎన్నో ఇబ్బందులు వచ్చాయని, తనకు కూడా అలాంటి ఇబ్బందులొస్తే ఎదుర్కోవడానికి సిద్ధంగా ఉన్నానని చెప్పారు. భూపాలపల్లి నియోజకవర్గాన్ని అన్ని రంగాల్లో అభివృద్ధి చేస్తే ప్రస్తుతం కొందరు అక్రమ కేసులు పెట్టించి రాజకీయ లబ్ధి పొందాలనుకుంటున్నారని అన్నారు. కార్యక్రమంలో బీఆర్‌ఎస్ నాయకులు గండ్ర గౌతమ్‌రెడ్డి, మేకల సంపత్ యాదవ్, బుర్ర రమేశ్, గండ్ర హరీశ్ రెడ్డి, కళ్లెపు రఘుపతి, సెగ్గం సిద్దు పాల్గొన్నారు.

**చెల్పూర్‌లో అపూర్వ స్వాగతం**

గణపురం : తిరుమలకు పాదయాత్రగా బయల్దేరిన గండ్ర జ్యోతికి, వెంట ఉన్న మాజీ ఎమ్మెల్యే వెంకటరమణారెడ్డికి గణపురం మండలం చెల్పూర్‌లో బీఆర్‌ఎస్ శ్రేణులతో కలిసి మహిళలు మంగళహారతులతో అపూర్వ స్వాగతం పలికారు. సర్పంచ్ నడిపెల్లి మధుసూదన్‌రావు శాలువా కప్పి సన్మానించారు. బీఆర్‌ఎస్ మండలాధ్యక్షుడు మోతె కరుణాకర్‌రెడ్డి, సర్పంచ్‌లు నల్లాని అరుణా తిరుపతిరావు, ఉప సర్పంచ్ రజియా, మార్కెట్ కమిటీ చైర్మన్ పోలుసాని లక్ష్మీనరసింహారావు నాయకులు రమేశ్, రవి, సాంబారెడ్డి, శ్రీనివాస్, దేవేందర్‌రావు, సాంబయ్య, సంపత్, కృష్ణస్వామి, ఉదయలక్ష్మి, ప్రమీల తదితరులు పాల్గొన్నారు.

## సాగునీటి కోసం రైతుల రాస్తారోకో



ప్రధాన రహదారిపై బైఠాయించిన రైతులు

- రోడ్డుపై పడుకొని ఆదివాసీల నిరసన
- పాలెం వాగు ప్రాజెక్టు కెనాల్‌కు మరమ్మతులు చేయాలని డిమాండ్

వెంకటాపురం(నూగూరు), జనవరి 20 : పాలెం వాగు ప్రాజెక్టు నుంచి సాగునీరు సరఫరా చేయాలని రైతులు రోడ్డెక్కారు. ములుగు జిల్లా వెంకటాపురం(నూగూరు) మండల పరిధిలోని చిరుతపల్లి ప్రధాన రహదారిపై బర్లగూడెం సర్పంచ్ కొర్స నర్సింహమూర్తి, ఆదివాసీ నవ నిర్మాణ సేన(ఏఎన్ఎస్) రాష్ట్ర నాయకులు వాసం నాగరాజు ఆధ్వర్యంలో శనివారం ఆదివాసీ రైతులు రాస్తారోకో నిర్వహించి, రోడ్డుపై పడుకొని నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా నర్సింహమూర్తి, నాగరాజు మా ట్లాడుతూ ఆదివాసీ రైతులకు సాగునీరు ఇవ్వకుండా అధికారులు నిర్లక్ష్యం చేస్తున్నారన్నారు. కోట్ల రూపాయలు వెచ్చించి నిర్మించిన ప్రాజెక్టు నీళ్లు రైతులకు ఉపయోగపడడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రాజెక్టు కెనాల్‌కు అధికారులు మరమ్మతులు చేయక పోవడం వల్ల గిరిజన రైతుల కు సాగునీరు అందడం లేదని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఇప్పటికైనా పాలెం వాగు ప్రాజెక్టు కాలువలకు మరమ్మతులు చేసేలా చర్యలు తీసుకోవాలన్నారు. రాస్తారోకో విషయం తెలుసుకున్న అధికారులు ఆందోళన చేస్తున్న రైతులతో మాట్లాడి సమస్యను ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లి పరిష్కారానికి కృషిచేస్తామని హామీ ఇవ్వడంతో రైతులు శాంతించారు. నిరసన తెలిపిన వారిలో అట్టం సత్యం, ఇర్పబాబు, బర్లగూడెం మాజీ సర్పంచ్ మిచ్చా వెంకటమ్మ, తదితరులు పాల్గొన్నారు.